# బదిలీ

**బస్సులోంచి కిందికి దిగగానే 'హలో!' అంటూ పలకరించినట్లుగా, గాలితోపాటు వచ్చి మీదపడింది ఆ ఊరిదుమ్ము. మారుతీరావు మనసు భగ్గుమంది. 'ఛీఛీ! డర్టీ విలేజ్!' అనుకున్నాడు. తనను ఆ ఊరికి ట్రాన్స్‌ఫర్ చేసిన పై అధికారులను మరోసారి తిట్టుకున్నాడు.**

ఓ
జబ

ఉదయాన్నే ప్రయాణం అయ్యేముందు ఇంటి దగ్గర శ్రీమతి ఇచ్చిన కాఫీ తప్ప ఇంకేం తీసుకోలేదు. కడుపు ఖాళీగా ఉంది. ఆ పల్లెటూరి సర్వీస్ బస్‌లో ప్రయాణం ఎడ్లబడిలో ప్రయాణం చేసినట్లుగా ఉంది.

వాచీలో టైం చూశాడు మారుతీరావు. పన్నెండు గంటలైంది. అతనిపై ఆకలి తన ప్రభావాన్ని చూపించసాగింది. ఊళ్లో మంచి హోటల్ ఏదైనా ఉందేమో కనుక్కోవాలి అనుకుంటూ నీరసంగా నడవసాగాడు.

ఆ ఊరు మండల కేంద్రమైన మూలగొట్టు పల్లెటూరి వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ ఉంది. చిన్న చిన్న టీ దుకాణాలు వరుసగా కనిపిస్తున్నాయి కానీ భోజనం తయార్ అన్న బోర్డు ఎక్కడా కనిపించటం లేదు.

ఎర్రగా నమిలిన తమలపాకు తమ్మ తుపుక్కున తన ముందు పడడంతో సడెన్ బ్రేక్ వేసినట్లుగా ఆగిపోయాడు మారుతీరావు. కోపంతో తలెత్తి చూడగానే ఎర్రటి గారపండ్లతో దర్శనమిచ్చింది ఓ నవ్వు. అతనిలోని కోపం తారాస్థాయినందుకుంది.

డర్టీఫెలో కొంచెం ఉంటే తనమీద ఊసేవాడే! మనసులో తిట్టుకున్నాడు.

'సారూ! నువ్వు మా ఊరికి కొత్తగా వచ్చినవనుకుంట!!' అన్నాడు. ఆ అగంతకుడు. అతని నోట్లోంచి తమలపాకు పొగాకు కలిపి నమిలిన వాసన గప్పుమంది.

మారుతీరావులో కోపానికి హద్దులు లేకుండా పోయింది. చెడామడా అరుద్దామనుకున్నాడు. కల్చర్ లెస్ ఫెలో ఆఫీసర్‌ను నువ్వు అంటూ ఏకవచనంతో సంబోధించటమా! ఛీఛీ! అనాగరికమరీ ఎక్కువగా ఉంది. అది సరే అసలు బస్ దిగిన దగ్గర్నుంచి చూస్తుంటే ప్రతివాళ్లు ఆకులు నములుతూనే కనిపిస్తున్నారు. అసలు వీళ్లు తినేది అన్నమా ఆకులా అనే సందేహం వచ్చింది మారుతీ రావుకు.

'సారూ! మంచి హోటల్ ఉంది!' ఆకులు కాదు మేము తినేది భోజనము అన్నట్టు వినిపించింది.

మంచి హోటల్ అని వినపడగానే మారుతీ రావు ప్రాణం లేచి వచ్చింది. కోపం పూర్తిగా తగ్గిపోయింది. అదే కదా తనకిప్పుడు కావాల్సింది. అందుకే ఇతన్ని మంచిచేసుకోవటం ఉత్తమం.

చూడు బాబూ! నీ పేరేమిటి?

వెంకటయ్య సారూ!

వెంకటయ్యా! నువ్వు చెప్పిన హోటల్ బాగుంటుందా! ఇక్కడికి ఎంత దూరం ఉంటుంది.?

ర్దస్తు గుంటది సారూ! గంగాభవాని హోటల్ అంటే మా ఊళ్లో స్టార్ హోటల్ సారూ! హుషారుగా చెప్పాడు వెంకటయ్య.

అతని వెంటే నడవసాగాడు మారుతీరావు అలా కొంచెం దూరం నడిచి గంగాభవాని హోటల్ చేరుకున్నారు.

విస్తట్లో వడ్డించిన భోజనాన్ని కలిపి ఆత్రంగా తినబోయాడు.... పక్కనే ఆమ్లెట్ వేస్తున్న వాసన ఘుప్పుమంది. అప్పటికీ గానీ అర్థం కాలేదు మారుతీ రావుకు ఆ హోటల్లో నాన్ వెజిటేరియన్ సెక్షన్ కూడా ఉందని. బలవంతాన నాలుగు ముద్దులు తిని బయటపడ్డాడు. ఇలా ఈ హోటల్‌లో తిని ఇక్కడ ఉద్యోగం చేయడం... కలలో మాట ఛీ ఛీ! సరైన భోజన హోటల్ లేదు ఏం ఊరిది.

అతనిలో క్రమక్రమంగా నిస్సత్తువ ఆవరిస్తోంది. హోటల్ బయటికి రాగానే రెడీగా ఉన్నాడు. వెంకటయ్య.

'సారూ! భోజనం బాగుందా!' అన్నాడు. మరోసారి తమలపాకు తమ్మ తుపుక్కున ఊసి

ఆ! ఏదో ఫరవాలేదులే!

ఇంతకి సారూ! నువ్! ఏ ఆపీసుల ?

ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీరుని

ఎట్టెట్టా! నువ్వు మా వూరికి వచ్చిన కొత్త ఇంజనీరువా!

అవునయ్యా! ఇంజనీరుని...నాపేరు మారుతీ రావు

నమస్తే సారూ! మళ్లోస్త! అంటూ వెళ్లిపోయాడు వెంకటయ్య

మారుతీరావు కొంత రిలాక్స్ అయ్యాడు. ఆఫీసువైపు నడక సాగించిన అతనితోపాటు అలోచనలు కూడా నడవసాగాయి.

ఇంజనీరుగా తన ఇరవైఏళ్ల సర్వీసంతా పట్టణాల్లోనే అదీ ఒకటి రెండు చోట్లనే గడిచింది.

తనకు ఎన్నిసార్లు ట్రాన్స్‌ఫర్ వచ్చినా ప్రయత్నంచేసి ఆ ట్రాన్స్‌ఫర్ క్యాన్సిల్ అయ్యేలా చూసుకొనేవాడు. రెండు చేతులా సంపాదించే ఉద్యోగం కాబట్టి ఉద్యోగంలో చేరిన పదేళ్లకే టౌన్‌లో మంచి ఇల్లు కట్టించగలిగాడు. పిల్లల ఇంగ్లీషు మీడియం చదువుకు అనుకూలంగా ఉంది. ఆ ఊరు. కానీ సీనియారిటీ వచ్చిన తర్వాత తనను ఇలా ఒక మండల కేంద్రానికి బదిలీ చేయడం ఎంత ఘోరం! ఇక్కడ ఏం సౌకర్యాలున్నాయని!?........ కాపురం పెట్టటం ఎటువంటి పరిస్థితిలోను సాధ్యంకాదు. అక్కడ శ్రీమతి పిల్లలు— ఇక్కడ తను ఒక్కడే ఉండాలి. 'మై గాడ్'! ఆ ఆలోచన వస్తేనే బాధకలుగుతుంది.

ఉదయం తను బయలు దేరుతుంటే ఎన్నో జాగ్రత్తలు చెప్పింది శ్రీమతి. జాగ్రత్తగా ఉండండి! ఎక్కడ తింటారో ఏమో! హోటల్ తిండి మీకు గిట్టదు. ఎలాగండీ ! పోనీ నన్నుకూడా రమ్మంటారా!... అయ్యో నేనొస్తే! పిల్లలు ఎలాగండీ!.... అంటూ బాధపడుతున్న శ్రీమతిని చూస్తే నవ్వొచ్చింది మారుతీరావుకు. ఏం ఫరవా లేదోయ్! నాకేం భయం లేదు. అయినా నేను ఆ ఊళ్లో ఎన్నాళ్లు ఉంటానని, ఒక నెల చేసి లీవ్ పెట్టి వచ్చేస్తాను.

శలవు పెడతారా!

మామూలు లీవ్‌కాదు! లాంగ్‌లీవ్ పెడతాను. ఆ తర్వాత మళ్లీ ట్రాన్స్‌ఫర్ కోసం ట్రై చేస్తాను. అనగానే శ్రీమతి కొంచెం సంతోషపడింది.

ఆఫీసులో చాలా సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే ఈ ఊరికి ఎవరు బదిలీ అయినా రాకుండా ఎగేస్తారే తప్ప ఇంకో పరిస్థితి లేదన్నమాట అనుకున్నాడు అంతా అయోమయంగా ఉంది.

ఉన్న కొద్ది స్టాఫ్‌తోనే పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తిచేయించాడు మారుతీరావు.

కాలం నెలరోజులు ముందుకు కదిలింది. సరైన తిండి లేక చిక్కి సగమైపోయాడు మారుతీ రావు.

ఈ నెలరోజుల్లో ఓ అరడజన్ ఉత్తరాలైనా రాసుంటాడు ఇంటికి.

31వ తారీకు జీతం తీసుకొని లీవ్ పెట్టి బస్సులో కూర్చోగానే అమ్మయ్య అనిపించింది మారుతీరావుకు. సాధ్యమైనంతవరకు ఈ లీవ్ పొడిగిస్తూనే మళ్ళీ ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నం చేయాలి అనుకున్నాడు. బస్సులో ఎప్పుడు నిద్ర పట్టిందో ఏమో ! బస్టాండ్‌లో బస్సు ఆగగానే మెలకువ వచ్చింది.

బస్సు దిగి తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. రిక్షాలో ఇల్లు చేరాడు.

కథ

# శ్రీరామదాసు అమరనాథ్



చిక్కి సగమైపోయిన మారుతీరావును చూసి హడావిడి చేసింది అతని శ్రీమతి.

"అయ్యో! ఇదేమిటండీ! ఇలా అయిపోయారు! నేనప్పుడే అనుకున్నాను. ఎక్కడ తింటారో ఏమిటో! అసలే మీకు హోటల్ తిండి గిట్టదాయే! అందుకే అన్నాను నేనూ వస్తానండీ! అని"

"అబ్బబ్బ! ఇప్పుడు ఏమైందని!? బాగానే ఉన్నాగా!" అన్నాడు తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో..

"ఏం బాగుండటమండీ! చిక్కి సగమైపోయారు, ఈ మాయదారి ట్రాన్స్ఫర్ ఎందుకొచ్చిందో ఏమో!.....!"

"అబ్బబ్బ! అవన్నీ తరువాతగానీ ముందు నేను అర్జంట్‌గా స్నానం చేయాలి!" అంటూ బాత్‌రూం వైపు నడిచాడు.

రెండు రోజులు శ్రీమతి చేతి భోజనంతో కోలుకున్నాడు మారుతీరావు. పిల్లలతో సంతోషంగా గడపటంతో నూతన ఉత్సాహాన్ని పుంజుకున్నాడు.

"టెలిగ్రాం!" అన్న టెలిగ్రాఫ్ మెసెంజర్ పిలుపుతో బయటికొచ్చాడు మారుతీరావు, సంతకం చేసి టెలిగ్రాం అందుకున్నాడు. అతని చేతులు వణికాయి. అతని కళ్ల వెంట నీళ్లు జలజలా రాలాయి.

"ఏమిటండీ! ఏం జరిగింది!? ఎక్కడి నుండి టెలిగ్రాం" అంటూ వణికిపోసాగింది అతని శ్రీమతి.

"మా నాన్నకు సీరియస్‌గా ఉందట! మనం పిల్లలు త్వరగా వెళ్లాలి!" అన్నాడు ఆతృతగా.

"అయ్యో! మామయ్యగారికి సీరియస్‌గా ఉందా! మొన్న దసరా పండుగప్పుడు కూడా బాగానే ఉన్నారు కదండీ!....."

"సరే సరే త్వరగా మీరు ప్రయాణం కండి! మనం వెంటనే బయలుదేరాలి!" అంటూ హడావుడి చేశాడు మారుతీరావు.

క్రమబద్ధంగా లేని ఎర్ర బస్సుల్లో ప్రయాణం చేసి సాయంత్రానికి ఊరు చేరుకోగలిగారు ఊళ్లో ఇంటి దగ్గరికి రాగానే అక్కడి దృశ్యం చూసి దుఃఖం ఆపుకోలేకపోయాడు మారుతీరావు. చుట్టూ జనం. మధ్యలో తన తండ్రి శవం. ఏడుస్తున్న తన తల్లిని ఓదార్చలేక తండ్రి శవం దగ్గర చేరగిలబడ్డాడు.

"ఏమిటో ఈ మాయదారి జబ్బులు మాయదారి కాలం!" జనంలోంచి మాటలు వినపడుతున్నాయి.

"ఆయన ఆరోగ్యానికి ఇట్లా అనుకోకుండా జరగాల్సింది కాదు!"

"అసలు మనూరికి డాక్టర్ రాకపోవటమే ఇన్ని అనర్థాలకు మూలం!"

"ఈ అతిసార రోగం ఎంతమంది సంటిబిడ్డల్ని పొట్టన బెట్టుకుందో... ఆఖరికి బాబుగార్ని గూడ బలితీసుకుంది. ఆ డాక్టర్ సచ్చినోడు ఈ ఊరికి రాడు....! అడ్నించే ఇదంతా!" డెబ్బై ఏళ్ల నూకాలమ్మ మెటికలు విరిచింది.

"నూకాలమ్మా! నీ పిచ్చి కాని ఆ డక్టర్లు ఈ పల్లెటూళ్లకెందుకొస్తారు!? వాళ్లు పట్టణాల్లో ఉంటారు కానీ!"

"ప్రభుత్వం ఈ ఊళ్లో ఆసుపత్రి కట్టించినా డాక్టర్నిచ్చినా ఈ ఊరి గతింతే!... ఆసుపత్రిలో డాక్టర్లు ఉండడు".

ఇలా వినిపిస్తున్న మాటలు మారుతీరావును తట్టి లేపాయి.

"ఈ ఊళ్లో డాక్టర్ సమయానికున్నట్లైతే మీ తండ్రి చచ్చేవాడు కాదు బాబూ!" అన్నాడు ఆ ఊరి ఆసామి.

మారుతీరావు ఆలోచనలు వేగంగా పరుగెత్తసాగాయి. అంటే ఆ డాక్టర్ కూడా తనలాగే పల్లెటూరిలో ఉండలేక.... శలవు పెట్టాడన్న మాట. తన బోటి 'వైట్ కాలర్ ఫూల్స్' చేస్తున్న తప్పు ఏమిటో అర్థమైంది. ఆ 'తంతు' అంతాపూర్తయిన తర్వాత కుటుంబంతో సహా పల్లెటూరికి 'బదిలీ' అయ్యాడు. ●